క్లుప్తంగా

సూర్యవతి ఆశయ సాధనకు కృషి



సూర్యవతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐద్వా మహిళలు

కర్నూలు(సెంట్రల్): మానికొండ సూర్యవతి ఆశయ సాధనకు కృషి చేస్తామని ఐద్వా రాష్ట్ర నాయకులు నిర్మల, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరుణమ్మ, అలివేలమ్మ పేర్కొన్నారు. శుక్రవారం సూర్యవతి వర్ధంతి సందర్భంగా ఇందిరాగాంధీ నగర్, జొహరాపురం, ముజఫర్ నగర్‌లో ఆమె చిత్రపటాలకు ఐద్వా మహిళలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందిరాగాంధీ నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా హాజరైన పి.నిర్మల, ఎన్.అలివేలు మాట్లాడుతూ.. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై మానికొండ సూర్యవతి ఎన్నో పోరాటాలు చేశారన్నారు.

క్రీడాస్ఫూర్తితో రాణించాలి



పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీఓ భూపతిరావు

కర్నూలు (టౌన్): క్రీడాకారులు తమకు నచ్చిన క్రీడల్లో సాధన చేస్తూ అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు సూచించారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్థాయి మోడరన్ పెంటాథ్లాన్ (లేజర్ రన్) ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను డీఎస్‌డీఓ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోడరన్ పెంటాథ్లాన్ స్పోర్ట్స్ కోటాలో ఉందన్నారు. జిల్లా నుంచి అనేక మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచారన్నారు. ఆ సంఘం కార్యదర్శి అవినాష్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు నరసరావుపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

డిగ్రీ అడ్మిషన్ల షెడ్యూల్ ఇవ్వాలి



మాట్లాడుతున్న ఆర్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మహేష్

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే డిగ్రీ అడ్మిషన్ల షెడ్యూల్ విడుదల చేయాలని రిపబ్లికన్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 2 నెలలు గడిచినా డిగ్రీ అడ్మిషన్లు చేపట్టకపోవడం దారుణమన్నారు. శుక్రవారం బిర్లా గేట్‌లో ఉన్న ఆర్ఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ ఫలితాలు విడుదలై రెండున్నర నెలలు, సప్లిమెంటరీ ఫలితాలు విడుదలై నెల రోజులు గడిచినా ఇంతవరకు ఉన్నత విద్యా మండలి అధికారులు డిగ్రీ అడ్మిషన్ల కోసం షెడ్యూల్ విడుదల చేయకపోవడం దారుణమన్నారు. ఏటా మేలో ప్రక్రియను ప్రారంభించి జూన్‌లోపు పూర్తి చేసేవారని, ఈసారి జూలై మొదటివారం గడుస్తున్నా అసలు ప్రక్రియనే ప్రారంభించకపోవడం అన్యాయమని వాపోయారు.

ఉద్యోగికి పదవీ విరమణ సహజం



పదవీ విరమణ పొందిన లక్ష్మీకాంతమ్మను సన్మానిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు (టౌన్): ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ సహజమని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి, ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్ స్పష్టం చేశారు. పారిశుద్ధ్య విభాగంలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఇ.లక్ష్మీకాంతమ్మను శుక్రవారం స్థానిక ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన లక్ష్మీకాంతమ్మ ఆయురారోగ్యాలతో పూర్ణాయుష్షుతో జీవించాలని పేర్కొన్నారు. డివిజన్ యూనియన్ సభ్యులు బాలరాజు, వెంకటేశ్వర్లు, గంగారామ్, సాయి, ముకుంద, సువార్తమ్మ, సుశీలమ్మ, రాధమ్మ పాల్గొన్నారు.

నేడు 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'పై సమావేశం

కల్లూరు : కర్నూలు నగరంలోని కేఎస్ఆర్ కన్వెన్షన్ (హ్యాంగ్ అవుట్ హోటల్)లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీపై పాణ్యం నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం

- ఘనంగా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి
- పూలమాలలు వేసి నివాళులర్పించిన అధికారులు, ఉద్యోగులు

కర్నూలు(సెంట్రల్): స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ప్రజాసేవకు అంకితం కావాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య పిలుపునిచ్చారు. శుక్రవారం అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా అల్లూరి చిత్రపటానికి ఇన్‌చార్జ్ కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. భారత స్వాతంత్య్ర పోరాటంలో అల్లూరి సీతారామరాజు ఓ మహోజ్వల శక్తి అని కొనియాడారు. దేశం కోసం, అడవి బిడ్డల సంక్షేమం కోసం పోరాడిన ఆయన సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. సెట్కూరు సీఈఓ వేణుగోపాల్, డీఆర్వో వెంకట నారాయణమ్మ, ఇన్‌చార్జ్ ట్రైబల్ ఆఫీసర్ కొండయ్య, కలెక్టరేట్ ఏఓ శివరాముడు, టూరిజం అధికారి విజయ, సివిల్ సప్లై డైరెక్టర్ మహేష్‌నాయుడు, తహసీల్దార్, రమేష్‌బాబు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య



జెడ్పీలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు



మన్యం వీరుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు



అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ

కర్నూలు (టౌన్): స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ యస్.రవీంద్రబాబు ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

కర్నూలు: జిల్లా పోలీసు కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీ భాస్కర్‌రావు, కమాండ్ కంట్రోల్ సీఐ శివశంకర్, ఆర్ఐలు జావేద్, నారాయణ, సోమశేఖర్ నాయక్, ఆర్ఎస్ఐలు, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ కార్యాలయంలోని మినీ సమావేశ భవనంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి జెడ్పీ సీఈఓ జీ.నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీ పరిపాలనాధికారులు నాగేంద్రప్రసాద్, సీ.మురళీమోహన్‌రెడ్డి, జితేంద్ర, బసవశేఖర్, సరస్వతితో పాటు జిల్లా పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో పోరాటాలు

కర్నూలు(సెంట్రల్): మన్యం వీరుడు అల్లూరిసీతారామరాజు స్ఫూర్తితో కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలపై పోరాటాలకు పిలుపునిస్తున్నటు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా నాయకులు హుస్సేన్‌బాషా, ఉచ్చీరప్ప, కృష్ణ, బాలకృష్ణ, వెంకటేష్, సూరి, సంజన్న, పాల్గొన్నారు.

- సీఆర్ భవన్‌లో ఏఐవైఫ్ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్.లెనిన్‌బాబు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో బీక్యాంపు జూనియర్ కాలేజీలో అల్లూరి సీతరామరాజు జయంతి నిర్వహించారు. ఏఐడీఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు వి.హరీష్ కుమార్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ మల్లేష్, కళాశాల అధ్యాపకులు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు.



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఈదురుగాలులు.. మోస్తరు వర్షం

- కలెక్టరేట్ ప్రాంగణంలో ఆటోపై కూలిన చెట్టు
- ఒకరికి స్వల్ప గాయాలు
- పలు మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో గాలుల తీవ్రత పెరిగింది. గాలుల తీవ్రతకు కలెక్టరేట్‌లో భారీ వృక్షం వేర్లతో సహా నేలకూలింది. వంద ఏళ్ల నాటి అతి పెద్ద చెట్టు నేల కూలిందంటే గాలుల తీవ్రత ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల వల్ల ఆకాశం మేఘావృతం అయింది. మేఘాలు కమ్ముకోవడంతో పగలే చీకట్లు అలుముకున్నాయి. శుక్రవారం సాయంత్రం కర్నూలు నగరంలో పెనుగాలులు వీచాయి. గాలుల తీవ్రతకు కలెక్టరేట్‌లోని స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా ట్రెజరీ బ్రాంచ్ వద్ద ఉన్న చెట్టు కూలి అక్కడున్న ఆటోపై కూలింది. ఆటోలో ఉన్న వ్యక్తికి గాయాలయ్యాయి. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వాతావరణ శాఖ గంటకు 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని ప్రకటించింది. అయితే అతిపెద్ద చెట్టు కూలిందంటే గంటకు 50 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. చెట్టు కూలడంతో బ్యాంకు, డీఈఓ కార్యాలయాలకు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. కూలిన చెట్టును తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కాగా శుక్రవారం సాయంత్రం నుంచి ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో వర్షాలు కురిశాయి. కర్నూలు, కోసిగి, పెద్దకడబూరు. నందవరం, పాణ్యం, చాగలమర్రి, కొతాకం, ఎమ్మిగనూరు, ప్యాపిలి, ఆదోని, సి.బెలగల్, వెల్దుర్తి తదితర ప్రాంతాల్లో గాలులతో కూడిన తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి.



కలెక్టరేట్‌లోని ఎస్‌బీఐ ట్రెజరీ బ్రాంచ్ వద్ద ఆటోపై కూలిన భారీ వృక్షం

పార్టీ బలోపేతానికి సైనికుల్లా పనిచేయాలి

కర్నూలు (టౌన్): పదవులు దక్కినవారు పార్టీకి వన్నె తీసుకురావాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల పార్టీలో వివిధ పదవులు పొందిన నాయకులు శుక్రవారం రాత్రి గిప్సన్ కాలనీలోని స్వగృహంలో ఎస్వీతో పాటు ఆయన సతీమణి, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్‌పర్సన్ విజయ మనోహరిని ఘనంగా సత్కరించారు. ఎస్వీ వారికి శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. కూటమి ఏడాది పాలనపై అన్ని వర్గాల్లో అసంతృప్తి నెలకొందన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కంటే మిన్నగా పథకాలను ఇస్తామని చెప్పి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలందరినీ మోసం చేశారన్నారు. కూటమి ఏడాది పాలనలో ప్రతి ఇంటికీ జరిగిన అన్యాయాన్ని వివరించేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు మరింత పట్టుదలతో పనిచేయాలన్నారు. పార్టీ ఆదేశాల మేరకు 'బాబు షూరిటీ – మోసం గ్యారెంటీ'పై గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత పార్టీ నాయకులపై ఉందన్నారు. మహిళలకు నెలకు రూ.1500, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకు పింఛను, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి రూ.3 వేలు వంటి హామీలను ప్రభుత్వం విస్మరించిందని గుర్తు చేశారు. ప్రజలకు అండగా నిలిచి పార్టీని మరింత బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. పార్టీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్, మహిళా విభాగం ఉపాధ్యక్షులు సుమలత, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు ప్రభుదాస్, సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి యోగి, లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి రాజేష్, చేనేత విభాగం ఉపాధ్యక్షుడు మల్లికార్జున, సోషల్ మీడియా విభాగం ఉపాధ్యక్షుడు భాస్కర్, మున్సిపల్ విభాగం ప్రధాన కార్యదర్శి ఎస్‌టీ బాబు, వలంటీర్స్ విభాగం ఉపాధ్యక్షుడు అస్లాం తదితరులు పాల్గొన్నారు.



పార్టీ పదవులు పొందిన నాయకులతో ఎస్వీ మోహన్‌రెడ్డి

లక్ష్యాన్ని చేరుకోవాలి

కర్నూలు (టౌన్): ఇష్టంతో సాధన చేసి లక్ష్యాన్ని చేరుకోవాలని హోంగార్డు కమాండెంట్ మహేశ్వర్ క్రీడాకారులకు సూచించారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో శుక్రవారం జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ.. ఓటమి లేనిదే గెలుపు ఉండదని, ఓటములకు కుంగిపోకుండా గెలుపునకు కృషి చేయాలన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, పవర్ లిఫ్టింగ్ నిర్వహణ కార్యదర్శి వేణుగోపాల్, చిన్న సుంకన్న పాల్గొన్నారు.

వంగవీటి రంగాకు నివాళి

కర్నూలు (అర్బన్): నగరంలోని బలిజ సంఘం కార్యాలయంలో వంగవీటి మోహన్ రంగా జయంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం ప్రధాన కార్యదర్శి మండ్లెం రవికుమార్, కోశాధికారి శైలేష్ భాను, రిటైర్డ్ ఎస్ఐ ప్రకాష్, చింతలపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఓర్వకల్లు: ఎరువుల వ్యాపారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు పీఎల్ వరలక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సిబ్బంది, ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. మండల ఏఓ మధుమతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి జేడీఏతో పాటు, సహాయ సంచాలకులు శాలురెడ్డి, విజిలెన్స్ ఏడీఏ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండటంతో ఎరువుల కొనుగోలు జోరందుకుందన్నారు. ఎరువులు, నీళ్ల మందులు, విత్తన దుకాణాదారులు నిర్ణీత గడువులోగా తమ లైసెన్సులను రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. రైతుల అవసరాలను ఆసరాగా తీసుకొని రసాయన ఎరువులను అధిక ధరలకు విక్రయించినా, నకిలీ విత్తనాలను అంటగట్టినా, విచ్చల విడిగా నీళ్లమందులను విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణాల వద్ద స్టాక్ వివరాలతో కూడిన నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని వ్యాపారులకు సూచించారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని తెలిపారు. అనంతరం వ్యవసాయ అధికారులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఈఓలు మధు, భాస్కర్, వివిధ రైతు సేవా కేంద్రాల వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

వైద్య పరికరాల కొనుగోలుకు ఆమోదం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పలు రకాల వైద్య పరికరాల కొనుగోలుకు పర్చేజ్ కమిటీ ఆమోదం తెలిపిందని సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. శుక్రవారం ఆయన తన ఛాంబర్‌లో పర్చేజ్ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా రెండు ఆటో క్లియర్‌లు, రెండు హీమోడయాలసిస్ మిషన్లు, ఏఎంసీలో కొత్త ఆక్సిజన్ ప్యానెల్‌ల మరమ్మతు, పునరుద్ధరణ, మొత్తం లైన్ మార్పు, ఎస్ఎస్‌యూలో ఎయిర్ కంప్రెసర్, సర్జికల్ పోస్టు ఆపరేటివ్ విభాగానికి నాలుగు ఫ్లార్ బెడ్స్, రేడియాలజీ విభాగానికి డీఆర్ ప్యానెల్‌లు, రెండు కంప్యూటర్ సిస్టమ్‌లు కొనుగోలు చేసేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఇవి ఎంతగానో తోడ్పడతాయన్నారు. కమిటీ సభ్యులు అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, జనరల్ సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ పి.హరిచరణ్, వైద్యాధికారులు కె.శ్రీనివాసులు, పి.శ్రీనివాసులు, సుధీర్, ఎస్.లక్ష్మీబాయి, పద్మజ, శివబాల, సునీల్ ప్రశాంత్, ఏడీ మల్లేశ్వరమ్మ, ఏఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.



సమావేశంలో చర్చిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇవ్వాల్సిన పెండింగ్ పాఠ్య పుస్తకాలను వెంటనే ఇవ్వాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఆర్వో సి.వెంకటనారాయణమ్మను ఆమె కార్యాలయంలో కలసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలు తెరచి 20 రోజులు గడిచినా ఇంతవరకు పూర్తిస్థాయిలో పుస్తకాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతామని చెప్పిన కూటమి ప్రభుత్వం అమలులో మాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇంతవరకు విద్యార్థులకు పుస్తకాలతోపాటు సరైన బ్యాగులు, స్కూలు డ్రెస్సులు కూడా ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో మునిస్వామి, వినయ్, ప్రసాద వెంకట్ పాల్గొన్నారు.



డీఆర్వో సి.వెంకటనారాయణమ్మకు వినతిపత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కర్నూలు డిపో-2 వద్ద ఆర్టీసీ ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ కార్మికుల ధర్నా

కర్నూలు(సెంట్రల్): ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలులో డిపో-1, 2 కార్మికులు ఆయా డిపోల ఎదుట ఎర్ర బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ సిబ్బంది సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. దాదాపు ఆరేళ్లుగా పదోన్నతులు నిలిచిపోవడంతో డ్రైవర్లు, కండర్ల కొరత తీవ్రంగా ఉందన్నారు. ఈ క్రమంలో డ్రైవర్లు, కండక్టర్లు డబుల్ డ్యూటీ చేస్తున్నా అలవెన్స్‌లు ఇవ్వడం లేదని వాపోయారు. అలాగే పాత పద్ధతిలో ఆర్టీసీ ఉద్యోగులకు వైద్య సౌకర్యాలు కలిపించాలని, డ్యామేజ్ విషయంలో సిబ్బంది నుంచి రికవరీ చేయడాన్ని నిలుపుదల చేయాలని, ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీనే కొనుగోలు చేసి నిర్వహించాలన్నారు. టీఆర్ఎస్ సిబ్బందికి అక్రమ చార్జీషీట్‌లు ఇవ్వడం మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రెడ్డి, కృష్ణార్జునరెడ్డి పాల్గొన్నారు.

శాకంబరీ.. నమోస్తుతే



శాకంబరీ అలంకరణలో చౌడేశ్వరీ దేవి



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు



అంబా భవానీ ఆలయంలో శాకంబరీ అలంకరణలో..



కుంకుమార్చనలో భక్తులు

కర్నూలు కల్చరల్: ఆషాఢ మాసం శుక్రవారం పురస్కరించుకొని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. సప్తగిరి నగర్‌లోని చౌడేశ్వరీ దేవి ఆలయం, ఓల్డ్‌సిటీలోని లలితా పీఠం, బండిమెట్టలోని అంబా భవానీ ఆలయం, సూర్యనారాయణ స్వామి ఆలయాల్లో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకంబరీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చనలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి చౌడేశ్వరీ దేవికి నివేదించారు. భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): జూలై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు ఎండీ అంజిబాబు, మునెప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం ఎస్టీయూ భవన్‌లో ఉద్యోగ, కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్రాల్లోని కూటమి ప్రభుత్వాలు కార్మికులపై నిరంకుశ వైఖరిని అవలంభిస్తున్నాయని విమర్శించారు. 1986లో అమెరికాలోని చికాగో సమావేశంలో సాధించుకున్న 8 గంటల పని విధానానికి స్వస్తి చెప్పడం అన్యాయమన్నారు. పది గంటల పని విధానంతో రాత్రిళ్లు కూడా మహిళలు ఉద్యోగాలు చేయాలా? అని ప్రశ్నించారు. కార్మికులు ప్రాణ త్యాగం చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేయడం అన్యాయమని, వాటి స్థానంలో ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సురేష్ నాయక్, ఏఐయూటీయూసీ జిల్లా కార్యదర్శి నాగన్న, ఎల్ఐసీ ఉద్యోగుల యూనియన్ నాయకులు సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్.మునెప్ప

బాధితులకు న్యాయం జరిగేనా?

- కొన్నేళ్లుగా అక్రమాలు జరుగుతున్నా నియంత్రించడంలో సహకార శాఖ విఫలం
- కుంభకోణంపై తదుపరి చర్యలకు డీసీఓ ఆదేశాలు
- క్రిమినల్, సివిల్ కేసులకు రంగం సిద్ధం
- అక్రమార్కుల ఆస్తుల అటాచ్ చేసే దిశగా కసరత్తు

కర్నూలు(అగ్రికల్చర్): ది కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో జరిగిన అవినీతి దందాలో బాధితులకు న్యాయం జరుగుతుందా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. సొసైటీలో కష్టార్జితాన్ని దాచుకున్న వారు వేలాదిగా ఉన్నారు. దాదాపు ఐదారేళ్లుగా అక్రమాలు జరుగుతున్నా నియంత్రించడంలో సహకార శాఖ అధికారులు విఫలమయ్యారు. ఏటా ఆడిట్ జరుగుతుంది. మూడు, నాలుగేళ్ల క్రితమే ఆడిట్‌లో అక్రమాలు వెలుగు చూశాయి. అయితే చర్యలు లేవు. మేనేజింగ్ కమిటీ చైర్మన్ బాలరాజు ఒక్కరికే చెక్ పవర్ ఇవ్వడం పలు అనుమానాలకు తావిస్తోంది. అక్రమాలు బయటపడినప్పటికీ సీఈఓగా రఫీక్‌ను ఈ నెల 3 వరకు కొనసాగించడం గమనార్హం. సెక్షన్ 51 విచారణలో వెలుగు చూసిన కుంభకోణం కర్నూలు నగరంలో సంచలనం సృష్టిస్తోంది. అక్రమాల మీద తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా సహకార అధికారి వెంకటక్రిష్ణ డివిజినల్ సహకార అధికారి షేక్ జఫ్రీన్‌కు ఆదేశాలు ఇచ్చారు. రూ.2.42 కోట్లకు పైగా స్వాహా చేసిన కుంభకోణంలో క్రిమినల్, సివిల్ కేసులకు డివిజనల్ సహకార అధికారి చర్యలు తీసుకోవాల్సి ఉంది. అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి స్వాహా అయిన సొమ్మును రికవరీ చేసేందుకు డీఎల్‌సీఓ కోర్టు తరహాలో వ్యవహరించాల్సి ఉంది. సెక్షన్ 60 కింద విచారణ జరిపి సర్‌చార్జీ ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. అక్రమార్కులకు సంబంధించిన ఆస్తులను కూడా గుర్తించి అటాచ్ చేసే దిశగా సహకార అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. పొదుపు చేసుకున్న కష్టార్జితాన్ని కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ సొసైటీలో దాచుకుంటే స్వాహా కావడం పట్ల బాధితుల్లో ఆందోళన వెల్లువెత్తుతోంది. సాధ్యమైనంత త్వరలో అక్రమార్కుల నుంచి స్వాహా సొమ్ము రికవరీ చేసి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

శాస్త్రీయ విద్య అమలుకు పోరాడాలి



మాట్లాడుతున్న తాడికొండ రవి

కర్నూలు(సెంట్రల్): శాస్త్రీయ విద్యా విధానం కోసం విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని యూఎస్ఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షుడు తాడికొండ రవి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని జగదీష్ మాల్‌లో ఉన్న సంఘం కార్యాలయంలో సభ్యుడు ఉదయ్‌కుమార్ అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రజాతంత్ర బాధ్యులు జాతీయ కార్యదర్శి మర్రెడ్డి వెంకటరెడ్డి, భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు తాడికొండ రవి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో కషాయీకరణ విద్యా విధానాన్ని వ్యతిరేకించాలన్నారు. అశాస్త్రీయ విద్యావిధానాలతో వ్యవస్థ సర్వ నాశనం అవుతుందన్నారు. యూనివర్సిటీల వీసీలను గవర్నర్ నియమించడం ద్వారా విద్య గుత్తాధిపత్యాన్ని కేంద్రం తన చెప్పుచేతల్లో పెట్టుకుందన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో విఫలమైందన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయడం లేదని, కాలేజీ విద్యార్థులకు రూ.6400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడం లేదని విమర్శించారు.